# ప్రజా మారుతి

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 258 పేజీలు : 04 వెల రూ. 2 శుక్రవారం 17 - 04 - 2026




మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఒవైసీ


## తెలంగాణ రాష్ట్రంపై నిరంతరం
# విషపూరిత వ్యాఖ్యలు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- తెలంగాణను అవమానించిన తేజస్వి సూర్య ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి
- తెలంగాణ ఏర్పాటును భారత్-పాక్ విభజనతో పోల్చిన తేజస్వి సూర్య
- తేజస్వి వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని పొన్నం డిమాండ్
- బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న



**హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెను దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ తేజస్వి సూర్యపై నిప్పులు చెరిగారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు అత్యంత అజ్ఞానంతో కూడుకున్నవని, అవి ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని పొన్నం పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంపై బీజేపీ నిరంతరం విషపూరిత వ్యాఖ్యలు చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి సైతం తేజస్వీ వ్యాఖ్యలను ఖండించారు. పార్లమెంట్‌లో తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన మంత్రి పొన్నం వెంటనే ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ డీఎన్ఏ - మిగతా 2 లో

## తెలంగాణ రాష్ట్రంలో
# టాప్ 3 కులాలు



- నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం
- తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం అని వెల్లడి
- జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో
- ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీల జనాభా అత్యధికం
- దాదాపు 4 శాతం మంది ప్రజలు తమకు కులం లేదని వెల్లడించిన వైనం

**హైదరాబాద్ :**
తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు - మిగతా 2 లో



2 లో

## తేజస్వి సూర్యపై కల్వకుంట్ల కవిత నిప్పులు

- రాజీనామా చేయాలని డిమాండ్
- తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడారంటూ తేజస్విపై కవిత ఫైర్
- పవిత్రమైన ఉద్యమాన్ని అగౌరవపరిస్తే ఊరుకోబోమని హెచ్చరిక
- కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న

## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల
# దిశ, దశ మారతాయి

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- బిల్లుపై మూజువాణి ఓటింగ్‌ను వ్యతిరేకించి డివిజన్‌కు పట్టుబట్టిన విపక్షాలు
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 251, వ్యతిరేకంగా 185 ఓట్లు
- బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని పార్టీలకు ప్రధాని విజ్ఞప్తి



**ఢిల్లీ :**
మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు నిర్ణయాధికార ప్రక్రియలో పాలుపంచుకోవడం ద్వారా దేశానికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు.కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్... రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు, 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026లను సభ ముందు ఉంచారు. అయితే, ఈ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు మూజువాణి ఓటింగ్‌ను అంగీకరించలేదు. ఓట్ల విభజన (డివిజన్)కు పట్టుబట్టడంతో సభలో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది.బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలైనట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా లోక్‌సభలో మూజువాణి ఓటు ద్వారానే తీర్మానాలు ఆమోదిస్తారు. కానీ, ఫలితంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు సభ్యుల కోరిక మేరకు డివిజన్ నిర్వహిస్తారు. ఆటోమేటిక్ ఓట్ రికార్డర్ వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ తర్వాత ఓటు స్లిప్పుల ద్వారా జరిగిన ఓటింగ్‌లో మొత్తం 333 మంది సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, పార్టీలు ఈ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని విజ్ఞప్తి చేశారు. వికసిత భారత్ ఏ2047 లక్ష్యాన్ని - మిగతా 2 లో



2 లో

## మహిళా బిల్లుపై పార్లమెంట్ లో చర్చ

- అమిత్ షా, అఖిలేశ్ ల మధ్య మాటల యుద్ధం
- 'ఉప-కోటా ' కోసం అఖిలేశ్ డిమాండ్.. కుదరదని తేల్చిచెప్పిన అమిత్ షా
- ఓబీసీ, ముస్లిం మహిళలకు సబ్-కోటా ఇవ్వాలని అఖిలేశ్ డిమాండ్
- మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కుదరవన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

# గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000



భారీ హామీలతో 'టీవీకే' మానిఫెస్టో ఆవిష్కరించిన విజయ్

- 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం టీవీకే మేనిఫెస్టో విడుదల
- గృహిణులకు నెలకు రూ.2,500, నిరుద్యోగ భృతిగా రూ.4,000 హామీ
- ఏడాదికి 6 గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- పాలన, విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం
- తమిళనాడును డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా మార్చడమే లక్ష్యం

**చెన్నై :**
నటుడి నుంచి రాజకీయ నేతగా మారిన విజయ్, తన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని రాబోయే ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, భారీ సంక్షేమ పథకాలు, టెక్నాలజీ ఆధారిత పాలన హామీలతో కూడిన పార్టీ మేనిఫెస్టోను గురువారం సాయంత్రం విడుదల చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజికంగా పునర్నిర్మించేందుకు రంగాలవారీగా సంస్కరణలు చేపడతామని ప్రకటించారు. సంప్రదాయ - మిగతా 2 లో

## ప్రజానాడి




## డీలిమిటేషన్‌పై
# ప్రధాని భరోసా



2 లో

- హర్షం వ్యక్తం చేసిన మంత్రి నారా లోకేశ్
- రాష్ట్రాల సీట్ల నిష్పత్తిలో మార్పు ఉండబోదన్న మోదీ
- దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్న సమయంలో ప్రధాని హామీ ఎంతో కీలకమన్న లోకేశ్
- ఎన్డీయే సమాఖ్య స్ఫూర్తికి కట్టుబడి ఉంటుందని వ్యాఖ్య

## ఏపీలో ఇంటింటి
# గణన ప్రారంభం

- స్వయంగా తన వివరాలు నమోదు చేసుకున్న సీఎం చంద్రబాబు
- ఏపీలో ఇంటింటి గణన, గృహాల జాబితా సేకరణ ప్రారంభం
- స్వీయ నమోదు ప్రక్రియను ఆరంభించిన సీఎం చంద్రబాబు
- జనగణనలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపు
- మే 1 తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియ
- ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు వివరాలు నమోదు చేసుకునే అవకాశం
- ఆన్‌లైన్‌లో తన వివరాలను స్వయంగా నమోదు చేసుకున్న ముఖ్యమంత్రి



**అమరావతి :**
రాష్ట్రంలో ఈ రోజు నుంచి ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. 'హౌస్ లిస్టింగ్- హౌస్ సెన్సెస్' కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా వివరాల నమోదు ప్రక్రియ ఈ రోజు ప్రారంభమైంది. ౦వ.ఙవఅంబం.ఠ్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా చంద్రబాబు తన వివరాలను నమోదు చేశారు. ఇందులో మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను జనగణన డైరెక్టర్ జె.నివాస్ సీఎంకి వివరించారు.ఈ నెల 30వ తేదీ వరకూ ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని చంద్రబాబుకి తెలిపారు. మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపడతారని తెలియచేశారు. దీనిపై స్పందించిన సీఎం రాష్ట్రంలో పౌరులందరికీ సమానంగా సంక్షేమం అభివృద్ధి ఫలాలు అందించాలన్న - మిగతా 2 లో

# సంపాదకీయం

## పెనుమార్పు

పాతికేళ్ళక్రితం లాలూ యాదవ్ పార్టీ ఆర్జేడీతో తన రాజకీయ ప్రస్థానం ఆరంభించి, పన్నెండేళ్ళక్రితం నితీశ్‌కుమార్ పార్టీ జేడీయూలో చేరి, మూడేళ్ళలోనే అక్కడనుంచి బీజేపీలోకి గెంతిన సామ్రాట్ చౌదరి నేడు బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. యాభైఏడేళ్ళ వయసులో రాష్ట్రాన్ని ఏలబోతున్న తొలి బీజేపీ ముఖ్యమంత్రి ఆయన. గత ఏడాది అక్టోబర్‌లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా అమిత్ షా తారాపూర్ ప్రజలతో ఓ మాటన్నారు. సామ్రాట్ చౌదరిని గట్టిమెజారిటీతో గెలిపిస్తే, ఆయనను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక అత్యంత ముఖ్యమైన వ్యక్తిగా మార్చేస్తారని. ఎమ్మెల్యేగా గెలిచి సామ్రాట్ చౌదరి మళ్ళీ డిప్యూటీ సీఎం కావడమే కాక, కొద్దినెలల్లోనే ఏకంగా రాజ్యపాలకుడైనారు. లాలూ ప్రసాద్ పక్షాన రబ్డీదేవి రాష్ట్రాన్ని ఏలుతున్న కాలంలో ఓ చిన్న మంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరి, అతివేగంగా ఎదిగి పాతికేళ్లు తిరిగేసరికి సీఎం కుర్చీలో కూర్చోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. పిన్నవయసునుంచి పార్టీకోసం చెమటోడ్చి, కనీసం టిక్కెట్టు కూడా దక్కని అనేకమంది సీనియర్ బీజేపీ నాయకులు ఈ విఐపి తొమ్మిదేళ్ళలోనే సీఎం స్థాయికి ఎదిగిన తీరుచూసి కుళ్ళుకుంటున్నారట. ఢిల్లీ నుంచి ఎవరినో దించి కొత్త అలజడి సృష్టించడం కంటే డిప్యూటీ సీఎంగా ఉన్న వ్యక్తికే ప్రమోషన్ ఇస్తే పార్టీలో కుదుపులు, కుతకుతలు ఉండవని బీజేపీ అధిష్టానం అనుకొని ఉంటుంది. నితీశ్‌కుమార్ అధికారంలో ఉండగా, 'లవకుశు'లకు, అంటే కుర్మీ కుశ్వాహాలకు సమతూకంలో దక్కిన ప్రాధాన్యాన్ని అదేరీతిలో కొనసాగించడం కూడా బీజేపీ ఆలోచన కావచ్చు. యాదవేతర కులాలను తమ పక్షాన నిలబెట్టుకోవాల్సిన బీజేపీ, కుశ్వాహా కులానికి చెందిన సామ్రాట్ చౌదరిని ముఖ్యమంత్రి పదవిలో కూచోబెట్టింది కనుక, డిప్యూటీ సీఎం పదవి నితీశ్ కులమైన కుర్మీలకు దక్కుతుందని అంటున్నారు. నాలుగేళ్ళక్రితం నితీశ్‌కుమార్ మారోమారు ఎన్డీయేకి చెయ్యిచ్చి, ఆర్జేడీతో చేతులు కలిపిన ఆర్నెల్లలోనే సామ్రాట్ చౌదరిని బీజేపీ అధినాయకత్వం బిహార్ రాష్ట్రశాఖ అధ్యక్షుడుగా ప్రతిష్ఠించింది. ఆయన పనితీరుమీద ఎన్ని ఫిర్యాదులున్నా, అసమ్మతి తీవ్రస్థాయికి చేరినా, కష్టపడే ఆయన స్వభావం, పార్టీని ఒక్కతాటిపై నడిపించడంలో నైపుణ్యం చూసి బీజేపీ పెద్దలు సామ్రాట్‌ని స్వేచ్ఛగా వదిలేశారు. మహాగఢ్బంధన్‌లో చేరిన నితీశ్‌ను గద్దెదించేంతవరకూ నెత్తిన తలపాగా ధరిస్తానని ప్రతిజ్ఞచేసిన సామ్రాట్, మరో రెండేళ్లలో నితీశ్ వెనక్కురాగానే అయోధ్యవెళ్ళి, గుండుగీయించుకొని, సరయూ నదిలో మునకలేసి, తలపాగా వదిలేశారట. అమిత్‌షాకు అమిత విశ్వాసపాత్రుడు కావడమే కాక, నితీశ్, సామ్రాట్ మధ్య చక్కని సమన్వయం, సయోధ్య ఉండటం కూడా కొత్త సీఎం ఎంపికమీద పనిచేసివుండవచ్చు. మొత్తానికి, రాష్ట్రాన్ని సొంతంగా ఏలుకోవాలన్న బీజేపీ కోరిక ఇంతకాలానికి నెరవేరుతోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలనాటికే ఈ పరిణామాన్ని విశ్లేషకులు ఊహించారు. స్థానిక బీజేపీ నాయకులు సైతం తమ మనసులో కోరికను ఎప్పటికప్పుడు బయటపెడుతూనే వచ్చారు. తొలిసారిగా బీజేపీ, జేడీయూలు సమానసంఖ్యలో చెరి నూటొక్కస్థానాల్లో పోటీచేయడం కూడా ఈ ఊహాగానాలకు దోహదం చేసింది. నితీశ్ నాయకత్వంలో ఎన్నికలకు పోతున్నామని బీజేపీ ప్రకటించింది కానీ, కాబోయే ముఖ్యమంత్రి ఆయనేనని ఎక్కడా అనలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీజేడీయూ కలసికట్టుగా ఘనవిజయం సాధించి, బీజేపీ అతి పెద్దపార్టీగా అవతరించి, నితీశ్ పదోసారి సీఎం అయిన నాలుగునెలలకే ఆయన మనసు పెద్దల సభమీదకు పోయింది. ఎగువసభలో కూచొని ప్రజలకు సేవచేసుకోవాలన్న ఆ చిరకాల కోరిక రెండు దశాబ్దాలపాటు ముఖ్యమంత్రి పదవిని అనుభవిస్తున్నప్పుడు కానీ, కేవలం సీఎం కుర్చీకోసం పొత్తులను ఎడాపెడా మార్చేస్తున్నప్పుడు కానీ ఆయనకు ఎందుకో గుర్తుకురాలేదు. ఢిల్లీలో కూచొని బిహారీలకు పెద్దదిక్కుగా ఉంటానని ఆయన హామీ ఇస్తున్నప్పటికీ, బిహార్ రాజకీయాల్లో ఇక ఆయన పాత్ర ముగిసినట్టే, సామ్రాట్ చౌదరి ప్రవేశంతో రాష్ట్రం బీజేపీ వశమైనట్టే. చరిత్ర ఈ పరిణామాన్ని నితీశ్–లాలూ శకం ముగింపుగా గుర్తుంచుకుంటుందా, లేక బీజేపీ శకారంభంగా చూస్తుందా?



## కర్నూలు ప్రమాద బాధితులకు పరిహారం ప్రకటించిన ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి** – కర్నూలు జిల్లాలోని మంత్రాలయం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్‌ఆర్‌ఎఫ్) నుంచి నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది. గురువారం తెల్లవారుజామున మంత్రాలయం మండలం చిలకలడోన సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. శ్రీ రాఘవేంద్ర స్వామి వారిని దర్శించుకునేందుకు కర్ణాటకలోని చిక్‌మంగళూరు నుంచి యాత్రికులతో వస్తున్న బొలెరో



వాహనం, ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మరణించగా, మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. దీంతో మృతుల సంఖ్య 8కి చేరింది. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక బాలిక ఉన్నారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, బొలెరో డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి ప్రాథమిక కారణమని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ దుర్ఘటన అత్యంత బాధాకరమని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000

**మొదటిపేజీ తరువాయి** - సంక్షేమ పథకాలతో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను పాలనలో ప్రవేశపెట్టడం ద్వారా వినూత్న మార్పునకు శ్రీకారం చుడతామని విజయ్ స్పష్టం చేశారు. ప్రజాకర్షక పథకాలకు మేనిఫెస్టోలో పెద్దపీట వేశారు. గృహిణులకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు రూ.4,000, డిప్లొమా హోల్డర్లకు ₹2,500 భృతి అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఐదు లక్షల మందికి రూ.18,000 చొప్పున ఉపాధి ఆధారిత మద్దతు పథకాన్ని ప్రకటించారు. దీంతో పాటు, ఇంటర్న్‌షిప్ చేసే యువతకు రూ.5,000 నుంచి రూ.8,000 వరకు స్టైఫండ్ ఇస్తామని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందించే పింఛనును నెలకు రూ.3,000కు పెంచుతామని, దాదాపు 15 లక్షల మందికి ఈ ప్రయోజనం చేకూరుస్తామని పేర్కొన్నారు. మహిళా సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, పేద యువతుల వివాహానికి ఒక సవర బంగారం, పట్టు చీరతో కూడిన ఆర్థిక సహాయం అందిస్తామని వాగ్దానం చేశారు. ప్రభుత్వ భూముల్లో అర్హులైన వారికి ఉచితంగా ఇంటి పట్టాలు ఇస్తామన్నారు. ఆరోగ్య రంగంలో ఉచిత వైద్య పరీక్షలు, తక్కువ ధరలకే మందులు, క్యాన్సర్ బాధితుల కోసం ప్రత్యేక బీమా సౌకర్యం కల్పిస్తామని టీవీకే హామీ ఇచ్చింది. ప్రాథమిక సేవలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ, ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు, ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించారు. రైతులకు అండగా నిలుస్తూ, ఐదు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతుల రుణాల్లో 50 శాతం మాఫీ చేస్తామని, సౌరశక్తి ప్రాజెక్టులను ప్రోత్సహిస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారు. మత్స్యకారులకు కనీస మద్దతు ధర, చేపల వేట లేని సమయంలో రూ.27,000 ఆర్థిక సహాయం, రూ.25 లక్షల బీమా కవరేజీ కల్పిస్తామన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి అంగన్‌వాడీ సిబ్బందికి రూ.18,000, పారిశుద్ధ్య కార్మికులకు రూ.10,000 వేతనం, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు రూ.15 లక్షల ప్రయోజనం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తూ, "డ్రగ్–ఫ్రీ తమిళనాడు" కార్యక్రమాన్ని



ప్రారంభిస్తామని విజయ్ ప్రకటించారు. ఆర్థికంగా, 2036 నాటికి తమిళనాడును 1.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం రూ.15,000 కోట్లతో భద్రతా నిధిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ మేనిఫెస్టో ద్వారా సంక్షేమ పథకాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధిని జోడించి ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు టీవీకే సిద్ధమవుతోంది.

## మహిళా బిల్లుపై పార్లమెంట్ లో చర్చ

**మొదటిపేజీ తరువాయి** – కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై (నారీ శక్తి వందన్ అధినియం) పార్లమెంటులో వాడివేడి చర్చ జరిగింది. ఈ బిల్లులో ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలన్న డిమాండ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఈ చర్చలో అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ.. మహిళలకు కేటాయించిన 33శాతం రిజర్వేషన్లలో వెనుకబడిన వర్గాలు (ఓబీసీ), ముస్లిం మహిళలకు ప్రత్యేకంగా ఉప–కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అఖిలేశ్ డిమాండ్‌పై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. భారత రాజ్యాంగం ప్రకారం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం అసాధ్యమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నాయని విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి ఇది పూర్తిగా విరుద్ధమని ప్రభుత్వం తరఫున ఆయన గట్టిగా వాదించారు. ఈ బిల్లును వెంటనే అమలు చేయకుండా జనాభా గణన (సెన్సస్), నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అమలు చేస్తామని చెప్పడంపైనా విపక్షాలు అభ్యంతరం తెలిపాయి. ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందని అఖిలేశ్ యాదవ్‌తో పాటు ఇతర ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం



కాగా, ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా లేకపోవడమే ప్రస్తుత వివాదానికి కేంద్ర బిందువుగా మారింది.


## తెలంగాణ రాష్ట్రంలో టాప్ 3 కులాలు

**మొదటిపేజీ తరువాయి** – (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది.

ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

**సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా**

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (చీశీ ఝుర్వ)



తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

**కులాల వారీగా ప్రధాన వర్గాలు**

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి.

**ఓసీ వర్గాల్లో:** రెడ్డి సామాజిక వర్గం 4.8 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కోమటి (1.4 శాతం), కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు.

**బీసీ వర్గాల్లో:** షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందుండగా, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు.

**ఎస్సీ వర్గాల్లో:** మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

**ఎస్టీ వర్గాల్లో:** లంబాడీలు 6.8 శాతం జనాభాతో అగ్రస్థానంలో నిలిచారు. కోయ (1.2 శాతం), గోండ్ (1.1 శాతం), ఎరుకుల (0.5 శాతం) వారి తర్వాత ఉన్నారు.

ఈ సర్వే ద్వారా వెల్లడైన గణంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పన, రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## డీలిమిటేషన్‌పై ప్రధాని భరోసా



**మొదటిపేజీ తరువాయి** – నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని, పార్లమెంట్‌లో రాష్ట్రాల సీట్ల నిష్పత్తిలో మార్పు ఉండబోదని ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన హామీపై ఏపీ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని చేసిన ఈ ప్రకటన దక్షిణాది రాష్ట్రాలకు పెద్ద ఊరటనిస్తుందని ఆయన పేర్కొన్నారు. జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలు, సీట్ల విభజన వల్ల తమ ప్రాధాన్యత తగ్గుతుందని ఆందోళన చెందుతున్న తరుణంలో ప్రధాని ఇచ్చిన హామీ ఎంతో కీలకమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఎన్డీయే ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి కట్టుబడి ఉందనడానికి ప్రధాని మాటలే నిదర్శనమని కొనియాడారు. ఏ రాష్ట్రం కూడా నష్టపోకుండా అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నదే కూటమి ఉద్దేశమని స్పష్టం చేశారు. "ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు.. ఇది ఎన్డీయే గ్యారెంటీ" అంటూ లోకేశ్ ఎక్స్ వేదికగా ధీమా వ్యక్తం చేశారు. సమానత్వమే కూటమి లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల దిశ, దశ మారతాయి

**మొదటిపేజీ తరువాయి** – చేరుకోవడంలో మహిళా రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారికి మహిళా ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.

## తెలంగాణ రాష్ట్రంపై నిరంతరం విషపూరిత వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి** – ఉన్న ప్రతి ఒక్కరూ ఈ వ్యాఖ్యలను ఖండించాలని పొన్నం పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌరవాన్ని కించపరిస్తే తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? అని ఆయన నిలదీశారు. తెలంగాణ ఏర్పాటు అనేది దశాబ్దాల పోరాటమని, వేలాది మంది త్యాగాల ఫలితమని, దానిని విద్వేషపూరిత విభజనతో పోల్చడం రాజ్యాంగాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. తేజస్వి సూర్యకు తెలంగాణ చరిత్రపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. ఒక జాతీయ పార్టీకి చెందిన ఎంపీ ఇంత బాధ్యతారాహిత్యంతో మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

## ఏపీలో ఇంటింటి గణన ప్రారంభం



**మొదటిపేజీ తరువాయి** – సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. దీని కోసం కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికలని రూపొందించటం అవసరమని ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. 2 దశల్లో జనాభా లెక్కల కార్యక్రమం: రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా రాష్ట్రంలో జనగణన కార్యక్రమం జరుగుతోందని ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాకుండా అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. జనాభా లెక్కల కార్యక్రమం 2 దశల్లో జరుగనుందని మొదటి దశలో ఈ రోజు నుంచే ఇళ్ల గణన ప్రారంభమైందని వచ్చే ఏడాది నుంచి ప్రారంభమయ్యే 2వ దశలో జనాభా లెక్కల సేకరణ ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన ఇళ్ల గణన కార్యక్రమంలో ప్రజలు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. సరైన వివరాలను నమోదు చేయటం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలను కోరారు. మొత్తం ఈ జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

## తేజస్వి సూర్యపై కల్వకుంట్ల కవిత నిప్పులు



**మొదటిపేజీ తరువాయి** – పార్లమెంట్ వేదికగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కార్చిచ్చు రేపాయి. ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోషల్ మీడియా వేదికగా తేజస్వి సూర్యపై విరుచుకుపడ్డారు. నిండు పార్లమెంట్‌లో తెలంగాణ అస్తిత్వాన్ని, అమరవీరుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడటంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీకు ఎంత ధైర్యం ఉంటే తెలంగాణ ఏర్పాటును ఒక విద్వేషపూరిత విభజనతో పోలుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన తేజస్వి సూర్య తన ఎంపీ పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అంటే ఒక పోరాటమని, కోట్లాది మంది కలల సాకారమని... అటువంటి పవిత్రమైన ఉద్యమాన్ని అగౌరవపరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి బీజేపీ అగ్రనేతలు ఈ వ్యాఖ్యలపై ఎందుకు మౌనంగా ఉన్నారని కవిత ప్రశ్నించారు. సొంత రాష్ట్రాన్ని అవమానిస్తుంటే అడ్డుకోని వారు పదవుల్లో ఉండటానికి అనర్హులని, తెలంగాణ ప్రజలకు వారు సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు.

# న్యూరోసర్జరీలో సరికొత్త ముందడుగు

## కిమ్స్ సన్‌షైన్‌లో కోబోటిక్ మైక్రోస్కోప్ ప్రారంభం



**సికింద్రాబాద్, ఏప్రిల్ 16 ( ప్రజామంటలు):** బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో న్యూరోసర్జరీ రంగంలో సరికొత్త సాంకేతికతకు నాంది పలికారు. అత్యాధునిక జైస్ కినెవో900 కోబోటిక్ మైక్రోస్కోప్‌ను ప్రవేశపెట్టి, క్లిష్టమైన మెదడు మరియు వెన్నెముక శస్త్రచికిత్సల్లో ఖచ్చితత్వాన్ని మరింత పెంచారు. దేశవ్యాప్తంగా కొద్ది కేంద్రాల్లో మాత్రమే లభ్యమయ్యే ఈ సాంకేతికత అందుబాటులోకి రావడం విశేషం.గురువారం ఆసుపత్రిలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఈ పరికరాన్ని డా. ఎ.వి. గురవ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతోనే ఈ ఆధునిక పరికరాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు.కినెవో900 కోబోటిక్ మైక్రోస్కోప్‌లో రోబోటిక్స్, హైడెఫినిషన్ ఇమేజింగ్, స్మార్ట్ ఫీచర్లు సమన్వయంగా ఉండటంతో శస్త్రచికిత్సల సమయంలో వైద్యులకు మెరుగైన సహాయం అందుతుంది. "కోబోటిక్స్" విధానం ద్వారా వైద్యులు మరింత ఖచ్చితత్వంతో శస్త్రచికిత్సలు చేయగలుగుతున్నారు.ఈ పరికరంలో ఉన్న పాయింట్‌లాక్, పొజిషన్ మెమొరీ వంటి ఫీచర్లు సున్నిత ప్రాంతాలపై స్థిరమైన ఫోకస్‌ను కల్పిస్తాయి. రోబోటిక్ ఆర్మ్ సున్నితమైన కదలికలను అందిస్తూ, చిన్న ప్రాంతాల్లో కూడా సమర్థవంతంగా పనిచేస్తుంది. దీర్ఘకాలిక శస్త్రచికిత్సల్లో వైద్యుల అలసటను తగ్గించడంలో కూడా ఇది ఉపయోగ పడుతుంది.అదనంగా, ఐసీజీ ఫ్లోరసెన్స్ ఇమేజింగ్ ద్వారా రక్తప్రసరణను రియల్‌టైమ్‌లో గమనించవచ్చు. ట్యూమర్ ఫ్లోరసెన్స్ సాంకేతి కతతో ట్యూమర్ కణజాలాన్ని స్పష్టంగా గుర్తించి సురక్షితంగా తొలగించేందుకు వీలు కలుగుతుంది.ఈ సందర్భంగా సీనియర్ న్యూరోసర్జన్ డా. నవీన్ మెహ్రోత్రా మాట్లాడుతూ 3డీ, 4కే విజువలైజేషన్‌తో శస్త్రచికిత్స ప్రక్రియను అత్యంత స్పష్టంగా గమనించవచ్చన్నారు. ఇజుమా మైక్రో ఇన్‌స్పెక్షన్ సాధనంతో దాగి ఉన్న భాగాలను కూడా చూడగలమని తెలిపారు. నావిగేషన్ సపోర్ట్, రియల్‌టైమ్ డేటా ద్వారా ఖచ్చితత్వం పెరుగుతుందని చెప్పారు .సీనియర్ న్యూరో ఫిజీషియన్ డా. సి.హెచ్. గోపాల్ ఆధునిక ఇమేజింగ్ ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో న్యూరో సైన్సెస్ బృందానికి చెందిన వైద్యులు పాల్గొని రోగుల సంరక్షణలో అత్యాధునిక సాంకేతికతల ప్రాధాన్యతను వెల్లడించారు.

# సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం డ్రైవర్ల ప్రధాన బాధ్యత



**జగిత్యాల ఏప్రిల్ 16 (ప్రజా మంటలు) :**అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలుజగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజలకు సురక్షిత ప్రయాణాన్ని కల్పించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న " అరైవ్ అలైవ్" కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఆదేశాల మేరకు డి.ఎస్.పి రఘు చందర్ సూచనలతో సీఐ కరుణాకర్ నేతృత్వంలో ట్రాఫిక్ పోలీస్, ఆయా పోలీస్ స్టేషన్ల పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో నాలుగవ రోజు జిల్లా పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరము నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వాహన డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై కూడా దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన చూపు లేకపోతే, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ సైన్ బోర్డులు, ముందున్న వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని అన్నారు.అందువల్ల డ్రైవర్లు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా, సమయానుకూలంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో వైద్య బృందం ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం సిబ్బంది, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనుభవజ్ఞులైన కంటి వైద్యులు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించడం జరిగింది. అవసరమైన డ్రైవర్లకు తగిన సూచనలు ఇచ్చి, చూపు సమస్యలు గుర్తించిన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేయడంతో పాటు అవసరమైన మందులు కూడా పంపిణీ చేశారు.

# బుగ్గారం మండల అభివృద్ధికి అందరూ కృషి చేయాలి

**స్పెషల్ ఆఫీసర్, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారిణి సుజాత**

**మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్దాం**

**ఎంపిడివో అనుమల్ల వాసవి**

**ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

**తహసీల్దార్ భూమేశ్వర్**

**100 శాతం హాజరైన సర్పంచ్ లు**

**విజయ వంతమైన బుగ్గారం మండల స్థాయి సమావేశం**

**పత్తా లేని ఎక్సైజ్, వెటర్నరీ శాఖల అధికారులు**







**బుగ్గారం / జగిత్యాల జిల్లా:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలోని శ్రీ ముత్యాల పోచమ్మ - నల్ల పోచమ్మ ఆలయాల ఫంక్షన్ హాల్ లో గురువారం మండల స్థాయి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సమావేశం ఇంచార్జ్ ఎంపిడివో అనుమల్ల వాసవి అధ్యక్షతన విజయవంతమైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న " ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక, 99 రోజుల ఆక్షన్ ప్లాన్" లో భాగంగా గురువారం మండలంలోని 10 గ్రామాల ప్రజలతో, ప్రజా ప్రతినిధులతో మండల స్థాయి సమావేశం ఎంపిడివో అనుమల్ల వాసవి అధ్యక్షతన నిర్వహించారు.దీపారాధన అనంతరం తెలంగాణ గీతం, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, 99 రోజుల ఆక్షన్ ప్లాన్ లో భాగంగా మండలంలోని పది గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమాల వీడియో లను, ఫోటోలను డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రదర్శించి సభికులను ఎంతగానో ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల స్పెషల్ ఆఫీసర్ అయిన జిల్లా బిసి వెల్ఫేర్ అధికారిణి సుజాత ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. నూతనంగా ఏర్పడిన బుగ్గారం మండల అభివృద్ధికి అందరూ కృషి చేసి ఆదర్శ మండలంగా తీర్చి దిద్దుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన నిరుపేదలు తప్పని సరిగా పొందాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజా ప్రభుత్వంగా ఏర్పడ్డ ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గత రెండున్నర ఏండ్ల లో చేసిన అభివృద్ధి పనులను, అమలు పరిచిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ప్రజలకు అందిస్తున్న సేవలను, మండల పరిధిలో గల వనరులను, లబ్ధిదారులుగా ప్రజలు పొందిన లబ్ధిని ఉద్దేశించి ఆయా శాఖల అధికారులు వివరించారు.మండల తహసీల్దార్ భూమేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వారా అందిస్తున్న సేవలను, భూ భారతి లో జరిగిన మార్పులను, వివిధ పథకాల ద్వారామండలంలోని ప్రజలు పొందుతున్న సేవలను, లబ్ధిని ఆయన వివరించారు. సభాధ్యక్షులైన ఇంచార్జ్ ఎంపిడివో అనుమల్ల వాసవి మాట్లాడుతూ మండలంలోని పది గ్రామాలలో జరుగుతున్న ప్రజా పాలన గురించి వివరించారు. సర్పంచ్ లు, వార్డ్ సభ్యులైన ప్రజా ప్రతినిధులు అందరూ కలిసి కట్టుగా ఉండి ప్రజలకు కావాల్సిన వసతులన్నీ కల్పించి ఆయా గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. అందరం కలిసి మన బుగ్గారం మండలాన్ని కూడా అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్దామని ఆమె తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా మీ - మీ సర్పంచ్ ల ద్వారా మా దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారం కోసం మేము కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఎంపిడివో అనుమల్ల వాసవి హామీ ఇచ్చారు. 100 శాతం అనగా 10 గ్రామాలకు 10 గ్రామాల నూతన సర్పంచ్ లు వేదికనలంకరించి వారి - వారి సందేశాల ద్వారా ఆయా గ్రామాల ప్రజల యొక్క సమస్యలను, ప్రజా పాలనను వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిన లబ్ధిని, జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. మండల విద్యాధికారి సురోజు వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారిణి అక్షిత,విద్యుత్ శాఖ ఎ.ఈ. పూరెల్ల రాజ శేఖర్, వైద్య, ఆరోగ్య శాఖా వైద్యాధికారిణి ఆస్మా, సిహెచ్ ఓ శాంతిశ్రీ, హెల్త్ సూపర్ వైజర్ సులోచన, ఐసిడిఎస్ సిడిపిఓ వాణిశ్రీ, ఎసిడిపిఓ మౌనిక, సూపర్ వైజర్ నీలిమ, డి.ఆర్.డి.ఎ. మండల ఎపిఎం రమాదేవి, సీసీ పద్మ, పిఆర్ ఏఈ మహేందర్, ఇరిగేషన్ ఏఈ లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొని మాట్లాడారు. సామాజిక కార్యకర్త, తెలంగాణ జన సమితి పార్టీ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు చుక్క గంగారెడ్డి మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల సమస్యలను, ప్రజా సమస్యలను, మండల అభివృద్ధి పనులను, విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్, అంగన్ వాడి, తదితర సమస్యలను అధికారుల దృష్టికి, నూతన సర్పంచ్ ల దృష్టికి తీసుకు వెళ్లారు. వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు.కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్, ఉపాధ్యక్షులు నగునూరి నర్సా గౌడ్, మద్దునూరు మాజీ సర్పంచ్ బత్తుల తిరుపతి తదితరులు పాల్గొని ప్రసంగించారు. అంగన్ వాడి సెంటర్ల ద్వారా అందజేస్తున్న పోషకాహారాల పట్ల, వాటి విలువలు, వినియోగం పట్ల సమావేశానికి హాజరైన అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం ద్వారా ప్రత్యేకంగా ముద్రించబడిన డైరీని మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు సిద్ధం సతీష్ ఆధ్వర్యంలో తన కార్యదర్శుల బృందంతో కలిసి ఈ సభలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా నూతన డైరీని ఆవిష్కరించారు.వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, అంగన్ వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, వివిధ గ్రామాల వార్డ్ సభ్యులు, ప్రజలు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్ లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.పత్తా లేని ఎక్సైజ్, వెటర్నరీ శాఖ లుబుగ్గారం మండల కేంద్రంలో గురువారం జరిగిన మండల స్థాయి సమావేశం కు ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు, పశు వైద్యాధికారులు హాజరు కాకపోవడం పలు విమర్శలకు దారి తీసింది. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించడం లేదన్నారు. వీరి వలన అనేక మంది ప్రజలు, రైతులు తీవ్ర నష్టాలకు గురి కావడం జరుగుతుందన్నారు.పలు గ్రామాల ప్రజలతో పాటు సామాజిక కార్యకర్త చుక్క గంగారెడ్డి ఎక్సైజ్, వెటర్నరీ శాఖల అధికారులపై పలు ఆరోపణలతో కూడిన విమర్శలు చేశారు. ప్రజలకు మంచి సేవలు అందిస్తున్న శాఖల అధికారులను ఆయన సభా ముఖంగా కొనియాడారు. మండల ప్రజల పక్షాన బెస్ట్ సర్వీస్ చేస్తున్న శాఖల అధికారులకు చుక్క గంగారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తమ సేవలు అందించండి - నేషనల్ అవార్డ్ లు అందుకోండి : చుక్క గంగారెడ్డి ఉత్తమ సేవలు అందించండి - ఉత్తమ సేవల నేషనల్ అవార్డ్ లు అందుకోండి అని అవార్డుల సెలెక్షన్ కమిటి సభ్యుడు చుక్క గంగారెడ్డి స్థానిక ఎంపిడివో అనుమల్ల వాసవి ద్వారా ఈ సమావేశంలో ఒక ప్రకటన చేయించారు. బుగ్గారం మండలంలో ప్రజల మన్ననలు పొందే విధంగా కృషి చేసిన ఏవైనా రెండు శాఖల బెస్ట్ అధికారులకు, ఉత్తమ పరిపాలన చేసిన ఎవరైనా ఇద్దరు సర్పంచ్ లకు జాతీయ స్థాయి ఉత్తమ సేవల అవార్డ్ లు ఇప్పిస్తామని చుక్క గంగారెడ్డి ప్రకటనలో తెలిపారు.ఈ నేషనల్ అవార్డ్" లను బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సంస్థ ద్వారా ఇప్పిస్తానని నేషనల్ అవార్డ్ ల సెలెక్షన్ కమిటి సభ్యుడు చుక్క గంగారెడ్డి ఈ సభా ముఖంగా ఎంపిడివో ద్వారా ప్రకటన చేయించారు. అధికారులు, సర్పంచ్ లు మీ - మీ స్థాయిలో మంచి సేవలు అందించి ప్రజలచే మెప్పు పొందాలని వారు కోరారు. ఉత్తమ సేవలు అందించి మంచి పనులు చేసిన ప్రజా ప్రతినిధులను, అధికారులను ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని వారు వివరించారు.

# గొల్లపల్లి మండలాన్ని అభివృద్ధికి అందరూ కృషి చేయాలి

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి ఎంపీడీవో రవీందర్ రావు





**గొల్లపల్లి ఏప్రిల్ 16ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో గురువారం మండల స్థాయి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సమావేశం ఏర్పాటు చేశారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న " ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక, 99 రోజుల ఆక్షన్ ప్లాన్" లో భాగంగా మండలంలోని గ్రామాల ప్రజలతో, ప్రజా ప్రతినిధులతో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు ఎంపిడివో రవీందర్ రావు అధ్యక్షత వహిస్తూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, 99 రోజుల ఆక్షన్ ప్లాన్ లో భాగంగా మండలంలోని 27 గ్రామాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల ప్రత్యేక అధికారి కిషోర్ మాట్లాడుతూగొల్లపల్లి మండల అభివృద్ధికి అందరూ కృషి చేసి ఆదర్శ మండలంగా తీర్చి దిద్దుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన నిరుపేదలు తప్పని సరిగా పొందాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజా ప్రభుత్వంగా ఏర్పడ్డ ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గత రెండున్నర ఏండ్ల లో చేసిన అభివృద్ధి పనులను, అమలు పరిచిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ప్రజలకు అందిస్తున్న సేవలను, మండల పరిధిలో గల వనరులను, లబ్ధిదారులుగా ప్రజలు పొందిన లబ్ధిని ఉద్దేశించి ఆయా శాఖల అధికారులు వివరించారు.గొల్లపల్లి తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వారా అందిస్తున్న సేవలను, భూ భారతి లో జరిగిన మార్పులను, వివిధ పథకాల ద్వారామండలంలోని ప్రజలు పొందుతున్న సేవలను, లబ్ధిని ఆయన వివరించారు. సభాధ్యక్షు ఎంపిడివో రవీందర్ రావు మాట్లాడుతూ గ్రామాలలో జరుగుతున్న ప్రజా పాలన గురించి వివరించారు. సర్పంచ్ లు, వార్డ్ సభ్యులైన ప్రజా ప్రతినిధులు అందరూ కలిసి కట్టుగా ఉండి ప్రజలకు కావాల్సిన వసతులన్నీ కల్పించి ఆయా గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా మీ - మీ సర్పంచ్ ల ద్వారా మా దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారం కోసం మేము కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఎంపిడివో అన్నారు హామీ సర్పంచ్ లు వారి సందేశాల ద్వారా ఆయా గ్రామాల ప్రజల యొక్క సమస్యలను, ప్రజా పాలనను వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిన లబ్ధిని, జరిగిన అభివృద్ధి పనులను వివరించారు.పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రత్యేకంగా ముద్రించిన డైరీని గొల్లపల్లి మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షులు రవిరాజు కార్యదర్శి విక్రమ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, చేతుల మీదుగా నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు ఉప సర్పంచులు, అంగన్ వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, వార్డ్ సభ్యులు, పఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ ఆవిర్భావ సభ ఏర్పాట్లను పరిశీలించిన

## తెలంగాణ జాగృతి మహిళా నాయకులు



**మేడ్చల్ : ఏప్రిల్ 16 (ప్రజా మంటలు):**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈనెల 25న కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో జాగృతి మహిళా నాయకులు సభ ఏర్పాట్లను పరిశీలించారు.తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంచాల వరలక్ష్మీ ఆధ్వర్యంలో పలువురు మహిళా నాయకులు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్ సెంటర్‌లో సభ ఏర్పాట్లపై నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు.తెలంగాణ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చే జాగృతి క్యాడర్‌ను దృష్టిలో ఉంచుకుని వాహనాల పార్కింగ్, మహిళల కోసం ప్రత్యేక సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, విశ్రాంతి ప్రాంతాలు వంటి అంశాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా సభను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల సమన్వయం అవసరమని నాయకులు సూచించారు.పార్టీ ఆవిర్భావ సభ ఏర్పాట్లను పరిశీలించిన వారిలో జాగృతి నాయకులు పడాల మనోజా గౌడ్, మేక లలితా యాదవ్, కేఆర్ ధరణి, టి. సంధ్యారెడ్డి, బండారి లావణ్య, దేశపాక సుచిత్ర, అనుముల స్వప్న, శాంత, జె. స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి, జగిత్యాల వారిచే గొడుగులు తల టోపీల పంపిణి



**జగిత్యాల ఏప్రిల్ 16 ( ప్రజా మంటలు) :**ఈ నెల 24 వతేదీ నాడు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ఆరాధనా మహోత్సవము పురస్కరించుకొని వీధులలో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారికి ఎండ మరియు వర్షం నుండి రక్షణగా ఉపయోగపడేలా పెద్ద మరియు చిన్న గొడుగుల పంపిణీ మరియు తలటోపీల పంపిణీ గురువారం నాడు నిర్వహించారు.సత్యసాయి సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్ మాట్లాడుతూ భక్తులందరి సహకారంతో ఇంత ఎండాకాలంలో రెక్కాడితే గాని డొక్కాడని వీధి వ్యాపారులకు ఇట్టి గొడుగుల పంపిణీ సేవతో పాటు , అలాగే వివిధ దీనజన సేవలు నిర్వహిస్తామని ముఖ్యంగా రెండున్నర నెలల పాటు ఈ వేసవి కాలానికి ప్రతిరోజు మినరల్ వాటర్ పంపిణీ జరుగుతుందని, చెప్పులు , తల టోపీలు , బట్టర్ మిల్క్ వంటి తదితర వాటి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు , ఇట్టి అన్ని సేవలకు సహకరిస్తున్న భక్తులందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఇట్టి సేవలో సత్యసాయి సంస్థ తరపున కన్వీనర్ బట్టు రాజేందర్, చిటుమల్ల లక్ష్మీనారాయణ, గుండ రాజశేఖర్ , వంగల లక్ష్మీనారాయణ ,సామ సునీల్, ఠాకూర్ నారాయణ్ సింగ్ ,గూడూరు మురలీధర్ రావు , అమిరిశెట్టి ప్రభు , గట్టు రాజేందర్, రాజశేఖర్ మరియు మహిళా సభ్యులు బట్టు శ్రీలత, గుండ అర్చన, సామ రజిత, పూటూరి నాగరాణి, జిల్లా రవళి , మహంకాళి కౌసల్య, సామ లత, మాధురి,లిఖిత పాల్గొనడం జరిగింది.

# అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని జగిత్యాల జిల్లా కేంద్రంలో రక్తదాన శిబిరం కార్యక్రమం






**జగిత్యాల ఏప్రిల్ 16 ( ప్రజా మంటలు) :** ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుండి 20 వరకు వారం రోజులపాటు అగ్నిమాపక అమరవీరుల స్మారక వారోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సైదులు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సహకారంతో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బి. ఎస్ లత హాజరై, ఈ రక్తదాన శిభిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బి.ఎస్ లత మాట్లాడుతూరక్తదానం పట్ల ఇలాంటి అపోహలు అనుమానాలు అక్కరలేదని ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు.అలాగే, అగ్నిప్రమాదాలు మరియు ఇతర విపత్తులు సంభావించిన సందర్భంలో క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకొని ఆస్తులు, ప్రాణాలు కాపాడడంలో ముందుండేది అగ్నిమాపక సిబ్బందిదే ప్రధానపాత్ర అనీ, వారిని ముందుకు నడిపించే అధికారులే అసలైన రియల్ హీరోస్ అన్నారు. అనంతరం, అగ్నిమాపక శాఖలో అమరులైన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి, నివాళులు అర్పించారు.కాగా ఈ రక్తదాన శిభిరంలో జిల్లా అధికారి సైదులుతో పాటుగా 23 మంది అగ్నిమాపక అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సైదులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి మంచాల కృష్ణ, సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, కొమురవెల్లి వేణుగోపాల్, జగిత్యాల, ధర్మపురి అగ్నిమాపక కేంద్రం అధికారులు కృష్ణ కాంత్, శ్రీకాంత్ సంబంధిత శాఖ ఉద్యోగులు, సిబ్బంది, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డా. రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

# మంద గొల్లల' బొమ్మల ఆవిష్కరణ

## మిన్నంటిన ఆధ్యాత్మిక ప్రదర్శన



**గొల్లపల్లి ఏప్రిల్ 16ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలంలోని భీమ్రాజు పల్లి గ్రామంలో భక్తి పారవశ్యంలో మునిగితేలింది. గ్రామ యాదవ సంఘం అధ్యక్షులు సింగారపు లచ్చయ్య నివాస గృహంలో మంద గొల్ల కుల గురువు రామస్వామి అత్యంత వైభవంగా నిర్వహించిన మంద గొల్లల బొమ్మల ఆవిష్కరణ' కార్యక్రమం గ్రామస్థులను మంత్రముగ్ధులను చేసింది.విరాజిల్లుతున్న పురాతన సంప్రదాయంయాదవ కులస్తుల ఆరాధ్య దైవాలైన గంగాదేవి, మల్లికార్జున స్వామి, బీరప్పల వీరగాథలను ప్రతిబింబించేలా ఈ బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. తరతరాలుగా వస్తున్న ఈ మంద గొల్లల సంప్రదాయం కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాదని, అది తమ వంశ వృక్షానికి,కుల దైవాల చరిత్రకు సజీవ సాక్ష్యమని నిర్వాహకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఒగ్గు కళాకారులు డోలు వాయిద్యాల హోరు, కాళీ గజ్జల సవ్వడి మధ్య వినిపించిన వీరగాథలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఆసక్తిగా తిలకించారు.కర్రతో చెక్కిన దేవతామూర్తుల బొమ్మలను రంగురంగుల వస్త్రాలతో అలంకరించి కొలువు తీర్చారు. వేద మంత్రోచ్చారణల కంటే మిన్నగా, జానపద బాణీలతో దైవ నామస్మరణ మారుమోగింది. గ్రామంలోని యాదవ కులస్తులతో పాటు ఇతర వర్గాల ప్రజలు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా యాదవ సంఘం అధ్యక్షులు సింగారపు లచ్చయ్య మాట్లాడుతూ.. మాయమైపోతున్న మన ప్రాచీన కళలను, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది. మన పూర్వీకుల చరిత్రను, దైవ మహిమలను భవిష్యత్ తరాలకు అందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం" అని ఆనందం వ్యక్తం చేశారు.ఈ వేడుకతో భీమ్ రాజ్ పల్లి లో పండగ వాతావరణం నెలకొంది. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలగాని శ్రీలత, ఉప సర్పంచ్ బొమ్మన రాజమ్మ, సింగారపు దొంగయ్య తదితరులు పాల్గొన్నారు

# కెసిఆర్ బహిరంగ సభ వేదిక నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా ఇన్చార్జి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



**జగిత్యాల ఏప్రిల్ 16 ( ప్రజా మంటలు) :**20 తేదీన కెసిఆర్ బహిరంగ సభలో సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని మిని స్టేడియం లో నిర్వహించనున్న బహిరంగ సభకు స్టేజి నిర్మాణ పనులను జగిత్యాల జిల్లా ఇంఛార్జి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి , ధర్మపురి ఇంచార్జ్ ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు తో కలిసి పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ , ఎమ్మెల్సీ ఎల్ రమణ , మాజీ మంత్రి జీవన్ రెడ్డి , జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ మరియు మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్ లోక బాపు రెడ్డి బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

ప్రజా మంటలు

శుక్రవారం 17 - 04 - 2026

# దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు

**స్పష్టం చేసిన కేంద్రమంత్రులు**

**ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో కూటమి నేతల సమావేశం**

**చంద్రబాబుతో పవన్ కల్యాణ్, మాధవ్, పల్లా శ్రీనివాస్ భేటీ**

**నారీ శక్తి వందన్ బిల్లుకు మద్దతుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చ**



లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని, జనాభా సంఖ్యతో సంబంధం లేకుండా అన్ని రాష్ట్రాల్లో 50 శాతం చొప్పున సీట్లు పెరుగుతాయని కేంద్ర మంత్రులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు స్పష్టం చేశారు. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లు 50 శాతం పెంపు ఉంటుందని తేల్చి చెప్పటంతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని వివరించారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లుకి ఆమోదం ఘట్టాన్ని అమరావతి నుంచి వీక్షించే ఏర్పాటు చేయటంతో పాటు వైఎస్సార్సీపీ సహా అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్, పల్లా శ్రీనివాసరావులు నిర్ణయించారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో కూటమి పార్టీల నేతల సమావేశం జరిగింది. చంద్రబాబుతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, పల్లా శ్రీనివాసరావు సమావేశమయ్యారు. ఆ రెండు అంశాలకు సంబంధించిన ముసాయిదా బిల్లుల్లో పొందుపరిచిన అంశాలపై చర్చించారు. లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను 50 శాతం పెంచుతామని మాత్రమే ఆ బిల్లులో ఉందని, దాని వల్ల జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని కొన్ని రాజకీయ పార్టీలు లేవనెత్తుతున్న సందేహాలపై ప్రధానంగా చర్చ జరిగింది.

**3 పార్టీల నేతలు సంతృప్తి :** ఆ సందేహాల్ని నివృత్తి చేసుకునేందుకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్‌తో పాటు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడితో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో ఇప్పుడున్న లోక్‌సభ స్థానాలు 50 శాతం పెరుగుతాయని, అదే విషయాన్ని పునర్విభజన బిల్లులో కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంటుందని వారు స్పష్టతనిచ్చారు. దాంతో సంతృప్తి చెందిన కూటమి పార్టీల నేతలు ఆ బిల్లుని కలసికట్టుగా స్వాగతించాలని నిర్ణయించారు. కొందరు కావాలనే ఆ బిల్లుపై దుష్ప్రచారం చేస్తున్నారన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు 50 శాతం పెంచినప్పుడు ఒక లోక్‌సభ స్థానం పరిధిలోని సగటు జనాభాకి సంబంధించి రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య చాలా వ్యత్యాసానికి అవకాశం ఉందన్న చర్చ జరిగింది. ఈశాన్య రాష్ట్రాల్లో ఒక్కో లోక్‌సభ స్థానం పరిధిలో సగటు జనాభా చాలా తక్కువంటే, కేరళ వంటి అధిక జనాభా కలిగిన రాష్ట్రాలో 20 లక్షల వరకు ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సగటు జనాభా మధ్యస్థంగా ఉంటుందన్న చర్చ జరిగింది. అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య కూడా 50 శాతం పెంచే అంశాన్ని పునర్విభజన ముసాయిదా బిల్లులో ప్రస్తావించకపోవడంపై కేంద్ర మంత్రులతో కూటమి నేతలు చర్చించారు. ఆ అంశం ముసాయిదాలో ప్రస్తావించకపోయినా, పార్లమెంటులో చర్చ సందర్భంగా దానిపై స్పష్టతనిస్తామని, కానిపక్షంలో అసెంబ్లీ సీట్లు 50 శాతం పెంచే అధికారాన్ని పునర్విభజన కమిటీకే ఇస్తామని కేంద్ర మంత్రులు స్పష్టం చేసినట్టు తెలిసింది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ బిల్లుకి ఈ నెల 17న పార్లమెంటు ఆమోదం తెలిపే చారిత్రక ఘట్టానికి సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాన్ని అమరావతి వేదికగా అన్ని పార్టీల నాయకులు, మహిళలు కలిసి వీక్షించే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ రోజున అమరావతిలో 2-3 వేల మంది కూర్చుని వీక్షించేలా భారీ వేదిక ఏర్పాటు చేయనున్నారు. మహిళా బిల్లుని రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు స్వాగతిస్తున్నందున ఆ కార్యక్రమానికి వైసీపీ సహా అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని నిర్ణయించారు. ప్రజాప్రతినిధులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని, బిల్లుకి ఆమోదం లభించిన సందర్భాన్ని ఒక ఉత్సవంలా చేయాలని నిర్ణయించారు. వీక్షించేలా ఏర్పాట్లు: అమరావతితో పాటు, అన్ని నియోజకవర్గాల్లో ఆ కార్యక్రమాన్ని వీక్షించేలా ప్రత్యేక తెరలు ఏర్పాటు చేయాలన్న సూచన వచ్చింది. జిల్లా, నియోజకవర్గాల స్థాయిలోను భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించి సోదరీమణులకు శుభాకాంక్షలు, ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలపాలని నిర్ణయించారు. దాదాపు రెండున్నర గంటలపాటు వీరి సమావేశం జరిగింది. కొన్ని పార్టీలు చెప్తున్నట్లుగా దక్షిణాది రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు పెంపు లేదనే వాదనపై కేంద్ర పెద్దల నుంచి నేతలు స్పష్టత తీసుకున్నట్లు సమాచారం. కేంద్ర న్యాయశాఖ మంత్రితో పాటు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి మరికొందరితోనూ మాట్లాడి బిల్లుపై స్పష్టత తీసుకుని వారిచ్చిన వివరణతో 3 పార్టీల నేతలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంపుపై కేంద్రం నుంచి కూటమి నేతలకు స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. 50 శాతం నియోజకవర్గాల సీట్లు పెంపుపై దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదని దీనిని రాజకీయంగా కలిసి కట్టుగా స్వాగతించాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్ నిర్ణయించారు. కొందరు చేసేది అనవసర దుష్ప్రచారమని ఈ సందర్భంగా నేతలు నిర్ధారించుకున్నట్లు సమాచారం. జనాభా తో సంబంధం లేకుండా దక్షిణాదికి రాజకీయంగా నష్టం లేకుండానే బిల్లు రూపొందించిందని కేంద్ర పెద్దల నుంచి నేతలు ఈ మేర స్పష్టత తీసుకున్నట్లు తెలుస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా నేతలు చర్చించారు. 3 పార్టీల నేతలు కలిసి పెద్ద తెరపై కార్యక్రమం వీక్షించే ఏర్పాటు ఉంటే బాగుంటుందనే పవన్ ప్రతిపాదనకు అంగీకారం తెలిపిన సీఎం ప్రజా ప్రతినిధులందరినీ భాగస్వాముల్ని చేసేలా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. జిల్లా, నియోజకవర్గాల స్థాయిలోనూ భారీ ఎత్తున కార్యక్రమాలు చేపట్టి మహిళా సోదరీమణులకు, ప్రధానికి ధన్యవాదాలు తెలపాలని నిర్ణయించారు. అన్ని నియోజకవర్గాల్లో లైవ్ స్ట్రీమింగ్‌లు ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.

# దైవ దర్శనానికి వెళ్తుండగా ఘోర ప్రమాదం - 8 మంది మృతి

**కర్నూలు జిల్లాలో బొలెరో వాహనం**


**లారీ ఢీకొని ప్రమాదం**

**ఘటనలో 8 మంది మృతి,**

**12 మందికి గాయాలు**

**మృతులు కర్ణాటకలోని చిక్ మంగళూరుకు**

**చెందిన వారిగా గుర్తింపు**



ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మంత్రాలయం మండలంలోని చిలకలడోన వద్ద బొలెరో-రెడీమిక్స్ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతి చెందగా, 12 మంది క్షతగాత్రులయ్యారు. వారిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరులోని హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాద ఘటనా స్థలంలోనే ఐదుగురు మృతి చెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

**మృతుల వివరాలు :** ఈ ఘోర ప్రమాద ఘటనలో మృతులు కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌మంగుళూరు కనయాకనహళ్లి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. వాసులు కుమార్(60), సునీల్(40), దీపిక వీణ(35) బెల్లి(3 ఏళ్లు), మీనాక్షి(50 ఏళ్లు), పుట్టమ్మ, తాయమ్మ(60), లోలాక్షిగా గుర్తించారు.

**దైవదర్శనానికి వెళ్తుండగా :** కర్ణాటకలో రాష్ట్రంలోని చిక్‌మంగళూరుకు చెందిన కొందరు భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారమందుకున్న వెంటనే పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో బొలేరో వాహనంలో 23 మంది ఉన్నట్లుగా పోలీసులు వివరించారు. "చిలకలడోన గ్రామం దగ్గర నేషనల్ హైవే 167 పైన రోడ్డు ప్రమాదం జరిగింది. బీదర్ నుంచి టుముకూరు వైపుగా వెళ్తున్న రెడీమిక్స్ లారీని ఎదురుగా వస్తున్న, మంత్రాలయం వెళ్తున్న వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళలు, మూడేళ్ల వయసున్న బాలిక, ఇద్దరు పురుషులు మృతి చెందారు. గాయపడ్డ వారిలో ఏడుగురిని కర్నూలోని ఆస్పత్రికి తరలించగా, మరో నలుగురు ఎమ్మిగనూరులో చికిత్స పొందుతున్నారు. ఒక వ్యక్తి పరిస్థితి నిలకడగా ఉంది. మరిన్ని వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది .

**మృతులకు ప్రధాని సంతాపం :** మంత్రాలయం రోడ్డు ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబాలకు కేంద్రం తరఫున రూ.2లక్షల చొప్పున పరిహారాన్ని మోదీ ప్రకటించారు.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు :** రోడ్డు ప్రమాద దుర్ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడంపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన పట్ల విచారణ జరిపించాలని ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర మంత్రులు భరత్, జనార్దన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

**మితిమీరిన వేగమే ప్రాణం తీస్తోందా? :** ఇటీవల జరుగుతోన్న వరుస ప్రమాదాలతో ప్రజలు బెంబేళెత్తిపోతున్నారు. చాలా ఘటనల్లో మితిమీరిన వేగం, మద్యం సేవించి, నిర్లక్ష్యపూరితంగా డ్రైవింగ్ చేయడం లాంటివి కారణమవుతున్నారు. రాష్ట్రంలో రోజూ ఏదో చోట రోడ్లు నెత్తురోడుతూనే ఉన్నాయి. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ట్రాఫిక్ పోలీసులు ఎంతగా చెబుతున్నప్పటికీ వాహనదారులు పెడచెవిన పెట్టడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. కర్నూలు బస్సు ప్రమాద ఘటన మర్చిపోకముందే మరో ప్రమాదం జరగడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# రాబోయే 3 రోజులు మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లొద్దు

**ఆరోగ్య శాఖ హెచ్చరికలు**

**రాష్ట్రంలో దారెత్తిస్తున్న ఎండలు**

**వచ్చే మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు**

**అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న ఐఎండీ**



రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిర్మల్ జిల్లాలోని తానూరులో 43.5 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 43.2 డిగ్రీలు నమోదయ్యియి. కామారెడ్డి జిల్లాలోని మద్నూల్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్, మంచిర్యాల జిల్లాలోని భీమారం, నల్గొండ జిల్లాలోని అడవి దేవులపల్లిలో 43.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 43 డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు ఉన్నాయి. రానున్న మూడు రోజులు ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశముందని హైదరాబాద్ ఐఎండీ కేంద్రం వెల్లడించింది. బుధవారం 33 కేంద్రాల్లో 41 నుంచి 43.5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది. 'ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సగటున 43.3 డిగ్రీలు నమోదయ్యింది. గురువారం ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో సైతం పై జిల్లాలతో పాటు నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలో వడగాలులు వీస్తాయ'ని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. ఈ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశముందని వాతావరణ విభాగం పేర్కొంది.

**అప్రమత్తమైన ఆరోగ్య శాఖ :** తెలంగాణలో రాబోయే 3 రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. వడదెబ్బ బాధితులకు సత్వరమే చికిత్స అందించే విధంగా ఆస్పత్రుల్లో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య బయటకు వెళ్లొద్దని సూచించారు. దీంతోపాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆసుపత్రులకు, ప్రజలకు సూచిస్తూ వైద్యారోగ్యశాఖ బుధవారం ఒక ప్రకటనను విడుదల చేసింది.

**ఆరోగ్యశాఖ సూచించిన జాగ్రత్తలు ఇవే :** ప్రజలు మధ్యాహ్నం 12-3 గంటల మధ్య బయటకు వెళ్లకూడదు

రోజూ తగినంత ఓఆర్ఎస్, మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలి

బయటకు వెళ్లేటప్పుడు తలకు టోపీ, టవల్ లాంటివి ధరించాలి

ఆయిల్, మసాలా ఫుడ్ తినడం తగ్గించాలి

వడదెబ్బ లక్షణాలు గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐవీ ఫ్లూయిడ్స్, అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలి

గ్రామాల్లో ఏఎన్ఎం, ఆశా సిబ్బంది ద్వారా ఓఆర్ఎస్ పంపిణీ ముమ్మరం చేయాలి

**లక్షణాలు :**

శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరగడం

తల తిప్పడం

వాంతులు

గుండె వేగంగా కొట్టుకోవడం

అపస్మారక స్థితికి చేరుకోవడం

పైన వివరించిన లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని ఆరోగ్య శాఖ సూచించింది.

సత్వర చికిత్స అందించేందుకు ఏర్పాట్లు : వడ దెబ్బ బాధితులకు వేగవంతమైన, మెరుగైన వైద్య చికిత్సను అందించేందుకు వీలుగా అన్ని హాస్పిటల్స్‌లో ప్రత్యేకంగా డాక్టర్ల బృందాలు ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డా. గౌరవ్ ఉప్పల్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

**ప్రజలకు అవగాహన కల్పించండి :** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔట్ పేషెంట్లు, ఔట్ పేషెంట్ల వారి అటెండెంట్లు, ఆస్పత్రి సిబ్బందికి తాగు నీరు అందుబాటులో ఉంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అవసరమైన చోట చలివేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉక్కపోత సమస్య ఎక్కువవుతున్నందున ఏసీలు, కూలర్లు, ఫ్యాన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కార్మికులు వడ దెబ్బ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారిని దృష్టిలో పెట్టుకుని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పేషెంట్ వచ్చిన వెంటనే చికిత్స ప్రారంభించే విధంగా ప్రత్యేక బృందంలోని సిబ్బందికి అవసరమైన శిక్షణను ఇవ్వాలన్నారు. అన్ని ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

# 'జవాబుపత్రాల్లో డబ్బులు పెట్టాను

**నన్ను ఎలాగైనా పాస్ చెయ్యండి'**

**బోర్డు అధికారులకు ఫోన్ చేసి తనను ఎలాగైనా పాస్ చెయ్యాలని కోరిన విద్యార్థి**

**ఫోన్‌లోనే కౌన్సిలింగ్ ఇచ్చి అతని తల్లిదండ్రులతో మాట్లాడిన అధికారులు**




పరీక్షలు అంటే అందరికీ ఒకింత ఆందోళన ఉంటుంది. ఎంత బాగా ప్రిపేర్ అయినప్పటికీ చాలా మంది పరీక్ష అనగానే భయపడిపోతారు. ఇక పిల్లల పరిస్థితి అయితే చెప్పనక్కర్లేదు. పరీక్షలు ఒకెత్తు, ఫలితాలు అంతకు మించి టెన్షన్ పెడ్తాయి. రిజల్ట్ తెలిసే రోజూ పది రెట్లు ఎక్కువ భయాందోళనకు గురవుతుంటారు. కొందరు సున్నిత మనస్కులు ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. కానీ కొందరు విద్యార్థులు పరీక్ష సరిగా రాయకపోవడంతో తమని పాస్ చెయ్యాలంటూ ప్రాదేయపడుతూ జవాబు పత్రంలోనే బతిమాలుతూ వినతులు రాయడం చాలానే చూశాం. మరికొందరు బెదిరింపులకు పాల్పడతారు, ఇంకొందరు ఇంకోలా, తమకు తోచినట్లు ఏదో ఒక కహానీ అల్లుతారు. కానీ ఓ విద్యార్థి ఇవన్నీ చేసినప్పటికీ మళ్లీ ఫలితాల రోజు ఏకంగా ఇంటర్ బోర్డ్ అధికారులకే ఫోన్ చేశాడు. తనను పాస్ చెయ్యాలని కోరాడు. అతని సంగతేంటో తెలుసుకోవాలంటే ఈ కథనం చదవాల్సిందే.

**ప్రశ్నాపత్రాన్నే మూడుసార్లు రాశా:** నిన్న బుధవారం ఇంటర్మీడియర్ పరీక్షల ఫలితాలు వచ్చిన సంగతి తెలిసిందే. విశాఖకు చెందిన సెకండ్ ఇయర్ విద్యార్థి ఒకరు తాను ఫెయిల్ అవుతాననే భయంతో ఫలితాలు వెలువడక ముందు ఇంటర్ బోర్డు అధికారులకు ఫోన్ చేశాడు. ఏదో ఒక విధంగా తనను పాస్ చేయాలని కోరాడు. జవాబుపత్రాల్లో డబ్బులు కూడా పెట్టానని చెప్పాడు. అంతే కాకుండా తానూ ఏమీ చదవకపోవడంతో ప్రశ్నాపత్రాన్నే మూడుసార్లు రాశానని తెలిపాడు. విద్యార్థి మాటలు విని షాక్ అయిన అధికారి, వెంటనే అప్రమత్తమయ్యారు.

**తల్లిదండ్రులతో మాట్లాడిన అధికారులు:** అధికారులు ఆ విద్యార్థికి ఫోన్‌లోనే కౌన్సిలింగ్ ఇచ్చారు. త్వరలోనే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఉన్నాయని వాటికోసం చదువుకోవాలని సూచించారు. ఆ తర్వాత విశాఖ ఆర్ఐఓకు ఈ సమాచారం చేరవేశారు. ఈ విషయమై వెంటనే అతని తల్లిదండ్రులకు తెలపాలని చెప్పారు. అనంతరం జిల్లా అధికారులు ఆ విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి జరిగింది చెప్పారు. తమ కుమారుడు ఎటువంటి తొందరపాటు నిర్ణయం తీసుకోకుండా జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన ఈ విద్యార్థి ఫస్టియర్ రెండు సబ్జెక్టులు, సెకండియర్ మూడు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. అప్పటికే ఆ విద్యార్థి ఇంట్లోనే ఉన్నందున తాము జాగ్రత్తగా చూసుకుంటామని తల్లిదండ్రులు అధికారులకు తెలియజేశారు.

**సప్లిమెంటరీ పరీక్షలు:** రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఏప్రిల్ 20 నుంచి 27వ తేదీ వరకూ అవకాశం కల్పించాయి. మే 21 నుంచి జూన్ 4 వరకూ థియరీ సప్లిమెంటరీ పరీక్షలు, జూన్ 7 నుంచి 11 వరకూ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. జూన్ 5న ఎథిక్స్, హ్యూమన్ వాల్యూ, జూన్ 6న పర్యావరణ విద్య పరీక్షలు జరగనున్నాయి.

# పేదరికానికి కులం కూడా ఓ కారణమే!

**సమగ్ర కుటుంబ సర్వేలో షాకింగ్ నిజాలు**

**గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ మంది పేదలు**

**వార్షికాదాయం లక్షలోపు ఉన్నవి 1.1 కోట్ల కుటుంబాలు**

**కుటుంబ సర్వే నివేదికను ప్రభుత్వానికి అందించిన స్వతంత్ర నిపుణుల కమిటీ**



ఆర్థిక పరిస్థితులు వెనకబాటుకు ప్రధాన కారణమైనా, కులం అనేది పేదరికానికి సంబంధించి అన్ని స్థాయుల్లోనూ బలమైన ప్రభావం చూపిస్తోందని స్వతంత్ర నిపుణుల కమిటీ వెల్లడించింది. పేదరికమనేది కులంతో బలంగా ముడిపడిన అంశమని తెలిపింది. తెలంగాణ సామాజిక, ఆర్థిక, కుటుంబ సర్వే నివేదికను అధ్యయనం చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది.

**నివేదికలో ఏముందంటే? :** దేశంలో కులం లేదు, కేవలం పేదరికం మాత్రమే ఉంది. పేదరికానికి కులాన్ని కలిపి అణచివేతకు గురవుతున్నారని కొందరు అభిప్రాయ పడుతున్నారు. అయితే ఇప్పటికీ వెనకబాటుకు, పేదరికానికి కులం ప్రధాన కారణమని బలంగా చెప్పేవారూ ఉన్నారు. నిపుణుల కమిటీ ఈ విషయమై సమగ్ర సర్వే నివేదిక ద్వారా అధ్యయనం చేసింది. ఆ ఆధ్యయనంలో తెలుసుకున్న విషయాలివే!పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ మంది పేదలు నివసిస్తున్నారని, పట్టణాలతో పోల్చితే గ్రామాల్లో భూమి యాజమాన్యం ఎక్కువగా ఉన్నప్పటికీ పేదలు అక్కడే ఎక్కువగా ఉన్నారని తేలింది. జనరల్ కులాల కన్నా బీసీలు, బీసీల కన్నా ఎస్టీలు, ఎస్టీల కన్నా ఎస్సీల పేద కుటుంబాలు జీవనోపాధి సూచికల్లో వెనకబడి ఉన్నాయి.

**సర్వేలో వార్షిక ఆదాయాన్ని పరిశీలిస్తే :**

సర్వేలో కుటుంబాల వార్షికాదాయాన్ని గణకులు అడిగినప్పుడు 12 రకాల ఆదాయ పరిమితుల్లో ఆయా కుటుంబాలు ఏడాదికి రూ.50 వేల నుంచి రూ.కోటికి పైగా ఉందని వెల్లడించాయి. పేదరికాన్ని పరిశీలించేందుకు సర్వేలో రూ.లక్ష కన్నా తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలను పరిగణనలోకి తీసుకుంటే దాదాపు 1.1 కోటి కుటుంబాలున్నాయి. వాటిలో 63.4 లక్షలు బీసీ, 21.5 లక్షల ఎస్సీ, 14.3 లక్షల ఎస్టీ, 9.2 లక్షల జనరల్ కులాలున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 242 కులాల్లో బీసీల్లో యాదవులు, ముదిరాజ్‌లు, ఎస్సీలో మాదిగలు, ఎస్టీల్లో లంబాడీలే ఎక్కువ పేదలుగా ఉన్నారు. వీరిందరికీ సంవత్సరానికి రూ.లక్షలోపు వార్షిక ఆదాయం వస్తుంది. ఇందులో 1.1 కోట్ల కుటుంబాల్లో 40 శాతం వరకు వీరు, మిగత నాలుగు కులాల జనాభా 33 శాతం మాత్రమే ఉంది. జనరల్ కులాల్లోని పేదలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ పేదలకు మధ్య వెనకబాటులో వ్యత్యాసాలు, అసమానతలు పోల్చేందుకు 14 రకాల సామాజిక, విద్య, ఉద్యోగాలు, జీవన ప్రమాణాల సూచికలను పరిశీలించగా, మిగతా వర్గాల్లో కులం ఎంత ముఖ్యమైందో పేదల్లోనూ కుల ప్రభావం అంతే బలంగా ఉంది.

**పేదరికం ఇలా..**

| కేటగిరీ | పేదరిక (శాతం) |
|---|---|
| బీసీ | 58.4 |
| ఎస్సీ | 19.7 |
| ఎస్టీ | 13.2 |
| **జనరల్** | **8.5** |

**అట్టడుగున ఎస్సీ, ఎస్టీ, బీసీలు :** వెనకబాటు సూచీ అందరి పేదల్లో ఒకేలా లేదు. రూ.లక్ష కన్నా ఆదాయం తక్కువ ఉన్న కుటుంబాల్లో 13 రకాల వెనకబాటు అంశాలు పరిశీలించినప్పుడు విద్య నుంచి మరుగుదొడ్లు, రిఫ్రిజిరేటర్లు, విద్యుత్తు సౌకర్యం కలిగిన గృహాలు, రోజువారీ వేతన కార్మికులు, బాల కార్మికులు, కులాంతర వివాహాలు, ఆర్థిక రుణ భారాల వరకు ప్రతి దానిలోని జనరల్ కులాల కన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధ్వానస్థితిలో ఉన్నారు. పేద కుటుంబాల్లోని జనరల్ కులాలకు చెందిన 40 శాతం మంది పిల్లలు ప్రైవేటు స్కూల్స్‌లో చదువుతున్నారు. ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్న పేద కుటుంబాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు కూడా ఇదే పరిస్థితులు ఉన్నాయి. సంవత్సరానికి రూ.లక్ష ఆదాయం కలిగిన 56 కులాల్లో పేదల వెనుకబాటు సూచీని పరిశీలిస్తే, వెలమల్లో తక్కువ వెనకబాటు ఉంటే ఎస్సీ బేడల్లో అత్యధిక వెనకబాటు కనబడుతుంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com